నమస్తే తెలంగాణ
# నిజామాబాద్
5 నిజామాబాద్, శనివారం 2 నవంబర్ 2024 NIZAMABAD

## హైదరాబాద్‌కు వెళ్తే ఉద్యోగాలు ఊడుతాయ్..

- హోంగార్డు సిబ్బందికి అధికారుల వార్నింగ్
- పరేడ్‌గ్రౌండ్‌లో కౌన్సెలింగ్
- హాజరు తీసుకొని, సంతకాలు సేకరించి పంపిన వైనం
- ఉదయం 5 గంటలకే పరేడ్స్‌కు హాజరుకావాలని ఆంక్షలు



వినాయక్‌నగర్, నవంబర్ 1 : హోంగార్డుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు హోంగార్డ్ అసోసియేషన్ బాధ్యులు నేడు (శనివారం) 'చలో హైదరాబాద్' కార్యక్రమానికి పిలుపునిచ్చారు. కార్యక్రమానికి హోంగార్డులు వెళ్లకుండా చూడాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చినట్లు తెలిసింది. దీంతో నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న సుమారు 450 మంది హోంగార్డులను శుక్రవారం సాయంత్రం పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌కు రావాల్సిందిగా సంబంధిత అధికారులు సూచనలు చేశారు. దీంతో ఉన్నఫలంగా కమిషనరేట్ పరిధిలోని వివిధ డివిజన్ల పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న హోంగార్డులు సాయంత్రం 4 గంటలకు నిజామాబాద్ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌కు చేరుకున్నారు. సుమారు 3 గంటల పాటు హోంగార్డులు అక్కడే ఉండిపోయారు. చలో హైదరాబాద్ కార్యక్రమానికి ఎవరూ వెళ్లవద్దని, 'మీరు కేవలం సేవ చేసేందుకే వచ్చారని, మీరు ప్రభుత్వ ఉద్యోగులు కాదని' సంబంధిత అధికారులు వారికి ఆదేశాలు జారీ చేశారు. ఆదేశాలు ఉల్లంఘించి హైదరాబాద్‌కు వెళ్తే ఈ తాత్కాలిక ఉద్యోగం కూడా ఊడుతుందని హెచ్చరించినట్లు హోంగార్డులు స్వయంగా తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఉన్న హోంగార్డుల హాజరు తీసుకొని, సంతకాలు సేకరించినట్లు తెలిసింది. శనివారం ఉదయం 5 గంటలకే హోంగార్డులందరూ పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌కు రావాలని ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.

# హర్ ఏక్ ఫేక్ మాల్!

- ఏది అసలు.. ఏది నకిలీ
- పనిచేయని విద్యుత్ పరికరాలు
- రాజ్యమేలుతోన్న డూప్లికేట్ వస్తువులు...
- తాజాగా తుస్సుమన్న పటాకులు, చిచ్చుబుడ్లు...
- మోసపోతున్న సామాన్యులు
- అధిక ధరలకు అంటగడుతున్న వ్యాపారులు
- పట్టించుకోని వాణిజ్య పన్నుల శాఖ అధికారులు



నిజామాబాద్, నవంబర్ 1 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): నగరానికి చెందిన రాజేందర్ బల్బు కోసం ఓ ఎలక్ట్రిక్ షాపుకెళ్లాడు. సదరు షాపు యజమాని ఎల్ఈడీ బల్బులు చూపించాడు..లేటెస్టుగా ఇప్పుడిదే అందరూ వాడుతున్నారంటూ చెప్పాడు. రాజేందర్ గ్యారంటీ గురించి అడుగగా.. చెప్పలేమండి..ఇప్పటికే చాలా మంది తీసుకెళ్లారు.. ఒక్కసారి వాడి చూడండి అంటూ బల్బును చెక్‌చేసి చూపించాడు. దీంతో రాజేందర్ అడిగినన్ని డబ్బులు ఇచ్చి బల్బును తీసుకెళ్లాడు. ఇంటికెళ్లిన తర్వాత బల్బును ఆన్‌చేయగా..ఓ పదినిమిషాలు వెలిగి తర్వాత కాలిపోయింది. వెంటనే సదరు షాపు యజమాని వద్దకు వెళ్లి అడుగగా.. తానేం చేయలేనని, గ్యారంటీ ఇవ్వలేమని ముందే చెప్పామంటూ సమాధానమివ్వగా.. మోసపోవడం రాజేందర్ వంతయ్యింది. మార్కెట్‌లో ఒక వస్తువు వచ్చిందంటే చాలు.. అక్రమార్కులు అదే వస్తువును నకిలీగా తయారుచేస్తున్నారు. నకిలీ వస్తువును నిశితంగా పరిశీలిస్తేగానే గానీ తెలియకపోగా..కొందరు వ్యాపారులు చెబితే గాని మనకు వాటిపై అవగాహన రాదు. ఇప్పటికే మార్కెట్‌లో హర్ ఏక్ మాల్ అంటూ వేల దుకాణాలు వెలిశాయి. ఇవి భవనాల్లో కాకుండా రోడ్డుపక్కన తోపుడు బండ్లపై కూడా విక్రయిస్తుంటారు.

ఇలా బడా వ్యాపారుల నుంచి చోటా వ్యాపారుల దాకా సామాన్యులను ముంచేస్తున్నారు. అధిక ధరలకు వస్తువులను విక్రయించి లాభాలు ఆర్జిస్తున్నారు. పేరూ, ఊరూ లేని వస్తువులను కొని ప్రజలు గంటల్లోనే మోస పోతున్నారు. వ్యాపార, వాణిజ్య సముదాయాలకు పెట్టింది పేరుగా నిలిచిన నిజామాబాద్, కామారెడ్డి జిల్లా కేంద్రాల్లో ఈ తరహా మోసాలు నిత్యం బయట పడుతున్నాయి. దీపావళి పండుగ వేళా మరింత ఎక్కువగా ఈ మోసాలకు సామాన్యులు గురయ్యారు. ఓ వైపు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కి చిన్నా పెద్దా అంతా విలవిల్లాడుతుండగా.. నకిలీ వస్తువుల రూపంలోనూ జనాలంతా డొల్లా అవుతున్నారు. రూ.వందల్లో వెచ్చించిన వస్తువులు నాణ్యత లేకపోవడంతో నోరు వెళ్లబెట్టాల్సిన పరిస్థితి. నిజామాబాద్‌లో గాంధీచౌక్, నెహ్రూ చౌక్, కుమార్‌గల్లీ, దేవీ రోడ్డు, కామారెడ్డిలో గంజ్ ప్రాంతం, రైల్వే స్టేషన్ రోడ్డు ప్రాంతమంతా ఇందుకు అడ్డాగా మారుతోంది. పట్టించుకోవాల్సిన సంబంధిత అధికార యంత్రాంగం మామూళ్ల మత్తులో తూగుతుండడం మూలంగా సామాన్యులపైనే ఈ ప్రభావం పడుతోంది.

మరోవైపు ఫేక్ ఐటమ్స్‌ను ఇష్టానుసారంగా అమ్ముకుని అధికంగా లాభాలు గడించాలని చూసే వ్యాపారుల ఎత్తుగడతో కొనుగోలుదారులు నష్టాలు చూస్తున్నారు. దుకాణాల్లో టెస్ట్ చేసినప్పుడు పని చేయడం నిమిషాల్లో ఇంటికెళ్లి వాటిని పరీక్షిస్తే పని చేయకపోవడంతో జేబులకు చిల్లులు వేసుకుంటున్న వారు అధికంగా ఉంటున్నారు. ఇదేమని దుకాణాదారున్ని అడిగితే వారంటీ, గ్యారంటీ ఉండదంటూ బుకాయిస్తున్నారు. రూ.కోట్లలో నకిలీ వస్తువుల దందా రాజ్యమేలుతోంది. వందల దుకాణాల్లో ఈ తరహా వ్యాపారమే సాగుతోంది. బిల్లులు ఇవ్వరు, గ్యారంటీ రాదంటారు. క్వాలిటీ వస్తువులను చూపించకుండానే మాటల్లో ముంచెత్తి ఏదేదో చెప్పి అంటగడుతారు. తిరిగొచ్చి ప్రశ్నిస్తే మాత్రం జవాబివ్వకుండా దుకాణాదారులంతా ఏకమై కొనుగోలుదారులపైనే తిరగబడుతున్న ఘటనలు దేవీరోడ్డులో నిత్యం వెలుగు చూస్తున్నాయి. ఈ కోవలో ఈ దీపావళికి పటాకులు సైతం చేరాయి. రూ.వేలల్లో కొనుగోలు చేసిన పటాకుల్లో తుస్సుమన్నవే ఎక్కువగా ఉన్నాయి. పేలిన పటాకులు తక్కువ ఉండగా పాత సరుకు, క్వాలిటీ లేని పటాకులను కొని ఎంతో మంది ఈసారి మోసపోవాల్సి వచ్చింది. పటాకుల అమ్మకాలపై ఫైర్ సేఫ్టీ యంత్రాంగం కేవలం రక్షణకే పరిమితం కాగా క్వాలిటీపై దృష్టి సారించలేదు.



### అక్రమంగా నకిలీల దిగుమతి...

ఎల్ఈడీ బల్బులు వచ్చిన తర్వాత ఎలక్ట్రికల్ ఐటమ్స్‌లో కొంగొత్త వస్తువులు వచ్చాయి. ఇందులో నాణ్యత ఉన్నవి, నాణ్యత లేనివి పుట్టెడు పుట్టుకొచ్చాయి. చైనా నుంచి దిగుమతి అవుతున్న వస్తువులైతే అనేకం. షిప్పుల ద్వారా, దొంగ రవాణా ద్వారా నిజామాబాద్‌కు ఎలాంటి లేబుళ్లు లేకుండా వచ్చి పడుతున్న వస్తువులతో సామాన్యుల నెత్తిపై ఎనలేని భారం పడుతోంది. బ్రాండెడ్ ఐటమ్స్ కొనుగోలు చేద్దామనుకుంటే ఆకాశాన్ని తాకే ధరలతో కుదేలవ్వాల్సి వస్తోంది. ఎమ్మార్పీ పేరుతో జరిగే దోపిడీ భారం నుంచి ఉపశమనం కోసం సామాన్యులు ఇతరత్రా మన్నికైన వస్తువులను ఇంటికి తెచ్చుకుంటున్నారు.

### యంత్రాంగం పర్యవేక్షణ శూన్యం...

పరిశ్రమల నుంచి ఉత్పత్తి జరిగే ఎలక్ట్రికల్, ప్లంబింగ్, శానిటరీ వస్తువుల అమ్మకాలపై ప్రభుత్వ యంత్రాంగం పర్యవేక్షణ కరువైంది. వాణిజ్య పన్నుల శాఖ అధికారులు, జీఎస్టీ బాధ్యులు తనిఖీలు నిర్వహించి ఫేక్ ఐటమ్స్‌పై ఉక్కుపాదం మోపాల్సి ఉండగా అలాంటిదేమీ చేయడం లేదు. ఫలితంగా వ్యాపారులు ఇష్టానుసారంగా చైనా ఉత్పత్తులను అమ్ముతూ ప్రభుత్వానికి సైతం నష్టం చేస్తున్నారు. కొనుగోలుదారుడు చెల్లించిన మొత్తంలో పన్నుల రూపంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వానికి కాసింత ఆదాయం సమకూరాలి. కానీ ఫేక్ ఐటమ్స్‌కు బిల్లులు లేకపోవడంతో ఆదాయం రావడం లేదు. తద్వార ప్రభుత్వాలకు సైతం నష్టం వాటిల్లుతున్నది. వాణిజ్య పన్నుల శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించి కఠిన చర్యలు తీసుకుంటే ఇదంతా క్రమబద్ధంగా జరిగేది. మచ్చుకూ తనిఖీలు లేకపోవడంతో వ్యాపారుల ఆగడాలు మితిమీరి పోతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. చైనా ఉత్పత్తులతో భారతీయ ఉత్పత్తులు పోటీ పడడం లేదు. పక్క దేశాల నుంచి దొడ్డి దారిలో దిగుమతి అవుతన్న అనేక వస్తువులకు లోకల్ లేబుల్లు అతికించి విక్రయాలు చేస్తున్నారు. వీటిని సైతం కమర్షియల్ ట్యాక్స్ అధికారులు పట్టించుకోవడం లేదు. వ్యాపారులతో ములాఖత్ కావడం వల్లే దొందూ దొందే అన్నట్లుగా పరిస్థితి దాపురించిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. తనిఖీలను ముమ్మరం చేస్తే ఫేక్ ఐటమ్స్ రూ.కోట్లలో డంపులు దొరకడంతో పాటుగా ప్రభుత్వానికి దక్కాల్సిన ఆదాయం సక్రమ మార్గంలో వచ్చే వీలుందని ఆయా రంగాల నిపుణులు సైతం సూచిస్తున్నారు.


## పేకాట కోసం డబ్బులు ఇవ్వనందుకు..
## తండ్రిని హతమార్చిన తనయుడు

- నస్రుల్లాబాద్ మండలం నెమ్లిలో ఘటన



కర్రె సాయిబోయి (ఫైల్)

నస్రుల్లాబాద్, నవంబర్ 1: పేకాడేందుకు డబ్బులు ఇవ్వనందుకు తండ్రిని తనయుడు హత్యచేసిన ఘటన మండలంలోని నెమ్లి గ్రామంలో చోటుచేసుకున్నది. ఏఎస్సై వెంకట్రావ్ తెలిపిన వివరాల ప్రకారం.. నెమ్లి గ్రామానికి చెందిన కర్రె సాయబోయి (70)ని కుమారుడు కర్రె హన్మాండ్లు మద్యానికి బానిసయ్యాడు. పేకాట ఆడుతూ జులాయిగా తిరుగుతూ డబ్బుల కోసం తన తల్లి సాయవ్వ, తండ్రి సాయబోయిని తరచూ కొట్టేవాడు. డబ్బులు ఇవ్వబోమని చెబితే చంపేస్తానంటూ బెదిరించేవాడు. అక్టోబర్ 31 (దీపావళి) రాత్రి పేకాట ఆడడానికి డబ్బులు కావాలంటూ హన్మాండ్లు తండ్రిని అడిగాడు. లేవని చెప్పడంతో మద్యం మత్తులో ఉన్న హన్మాండ్లు ఇంట్లో ఉన్న పార కర్రతో సాయబోయిని తలపై గట్టిగా కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు ఏఎస్సై తెలిపారు. మృతుడి భార్య సాయవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.



ఎల్లంపేట గ్రామంలో కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వివిధ తండాల వాసులు, స్థానిక బీఆర్ఎస్ నాయకులు

## తండ్రిలాంటి కేసీఆర్‌ను దూరం చేసుకున్నం..

- మళ్లీ మీరే రావాలి.. మీరే కావాలి మాకు..
- కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలంలోని వివిధ తండాల ప్రజలు
- ఎల్లంపేట గ్రామంలో కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

మాచారెడ్డి, నవంబర్ 1 : పదేండ్ల కేసీఆర్ పాలనను ఆ తండాల ప్రజలు గుర్తుచేసుకుంటున్నారు. మాయమాటల కాంగ్రెస్‌ను నమ్మి తండ్రిలాంటి కేసీఆర్‌ను దూరం చేసుకున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలంలోని ఎల్లంపేట గ్రామంలోని వివిధ గ్రామ తండాల ప్రజలు, స్థానిక బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. సారే కావాలి.. కారే రావాలి అంటూ నినాదాలు చేశారు. పది నెలల కాంగ్రెస్ పాలనలో రైతులకు రైతుభరోసా లేదని, రుణమాఫీ కాలేదన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను కూడా ఏర్పాటు చేయడంలేదని మండిపడ్డారు. ఆసరా పింఛన్లు పెంచకపోగా..ఆరు గ్యారెంటీల పేర్లు చెప్పి అధికారంలోకి వచ్చిందన్నారు. కాంగ్రెస్ పార్టీ పేదలకు చేసింది శూన్యమని అన్నారు.

- ఉమ్మడి జిల్లాలో తడిసిన ధాన్యం..
- కొనుగోలుకేంద్రాల్లో 'సేకరణ' శూన్యం
- పట్టించుకోని అధికార యంత్రాంగం





లింగంపేట మండలం పర్మళ్ల గ్రామంలో కొట్టుకుపోయిన ధాన్యాన్ని ఎత్తుతున్న రైతులు

## అకాలవర్షంతో
# రైతన్న విలవిల..



రుద్రూర్‌లో వర్షపు నీరు బయటకి పోవడానికి కాలువ తీస్తున్న రైతు

నాగిరెడ్డిపేట/ బాన్సువాడ రూరల్/ రుద్రూర్/లింగంపేట/ నిజాంసాగర్, నవంబర్ 1: కొన్నిరోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు రైతులు విలవిలలాడుతున్నారు. రోడ్లు, కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిసిపోవడంతో ఆందోళన చెందుతున్నారు. శుక్రవారం కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలంలోని బోర్లం, కొయ్యగుట్ట, జక్కల్‌దాని తండా, బోర్లం క్యాంపుతోపాటు నాగిరెడ్డిపేట, రుద్రూర్, లింగంపేట మండలంలోని భవానీపేట, జల్దిపల్లి, ముంబాజీపేట, రాంపూర్, శెట్పల్లి, పర్మళ్ల, మెంగారం, బోనాల్, బాయంపల్లి, మహ్మద్‌నగర్ మండలం కోమలంచ గ్రామంలో శుక్రవారం వర్షం కురిసింది. దీంతో రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్దయ్యింది. ఇప్పటివరకూ రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం ఎక్కడికక్కడే ఉంది. దీనికి తోడు కురుస్తున్న వర్షాలు అన్నదాతలకు ఆందోళనకు గురిచేస్తున్నాయి. నాగిరెడ్డిపేట, లింగంపేట మండలాల్లో వర్షం నుంచి ధాన్యాన్ని కాపాడుకోవడానికి రైతులు నానా తంటాలు పడుతున్నారు. తడిసిన ధాన్యాన్ని చూస్తూ రైతులు కంట తడిపెడుతున్నారు. బాన్సువాడ మండలంలో ఇప్పటి వరకు రైతుల నుంచి ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయలేదు. దీంతో ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల చేతికొచ్చిన పంట నోటికందకుండా పోతోందని వాపోతున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని వెంటనే సేకరించాలని రైతులు కోరుతున్నారు.


### తడిసిన ధాన్యానికి మొలకలు



రామారెడ్డిలో కొనుగోలు కేంద్రంలో మొలకలు వచ్చిన వడ్లను చూపుతున్న రైతులు

రామారెడ్డి, నవంబర్1: మండల కేంద్రంలో శుక్రవారం కురిసిన వర్షానికి కొనుగోలు కేంద్రంలో ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. ఇప్పటివరకు కొనుగోళ్లు ప్రారంభించకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. 15 రోజుల నుంచి కొనుగోళ్లు ప్రారంభించకపోవడంతో తడిసిన ధాన్యానికి మొలకలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం మాజీ జడ్పీటీసీ నారెడ్డి దశరథ్‌రెడ్డి, ఏఎంసీ మాజీ డైరెక్టర్ పడిగెల శ్రీనివాస్ గుప్తా, బీఆర్ఎస్‌నాయకులు కొనుగోలు కేంద్రానికి వచ్చి రైతులతో మాట్లాడారు. తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. ప్రభుత్వం వెంటనే కొనుగోళ్లను ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

### వడ్లు మ్యాచర్‌కు వచ్చినయ్...



పొతంగల్, నవంబర్ 1: నాలుగెకరాల్లో వరి సాగు చేసిన. వడ్లు పూర్తిగా ఎండిపోయి మ్యాచర్‌కు వచ్చినయ్. కొనుగోలు చేస్తలేరు. దీపావళి పండుగ చేసుకుందామంటే వాతావరణం చూస్తే ఆగమాగం అయితుంది. వడ్లకాన్నే ఉండడవుతున్నది. వడ్లను ఎండిబెట్టి కుప్ప చేసినం. ఎప్పుడు కొంటారని ఏ అధికారికి అడిగిన కూడా ఫలితం లేదు. స్పందించి వెంటనే వడ్లు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్న.

- సూదం అశోక్, రైతు (పొతంగల్)



బోధన్‌లో ఓ ఇంటికి అతికించిన సమగ్ర కుటుంబ సర్వే స్టిక్కర్‌ను చూపుతూ సూచనలు ఇస్తున్న నిజామాబాద్ కలెక్టర్

## తప్పిదాలకు తావులేకుండా
# సర్వే నిర్వహించాలి..

### కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

బోధన్, నవంబర్ 1: రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి సంబంధించిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల వివరాల సేకరణ కోసం ప్రభుత్వం ఈ నెల 6నుంచి చేపట్టనున్న సమగ్ర కుటుంబ సర్వేను జిల్లాలో పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు. శుక్రవారం ఆయన ఇంటింటి కుటుంబ సర్వే నేపథ్యంలో బోధన్ పట్టణంతోపాటు మండలంలోని లంగ్డాపూర్ గ్రామంలో పర్యటించారు. రాకాసిపేట్‌తో పాటు లంగ్డాపూర్ గ్రామంలో అధికారులు, సిబ్బంది ఇండ్ల జాబితా రూపకల్పన కోసం చేపడుతున్న చర్యలు, పాటిస్తున్న పద్ధతులను కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. మూడు రోజుల్లోపు హౌసింగ్ లిస్ట్ ప్రక్రియను పూర్తిచేయాలని సూచించారు.

**ఏటీసీల నిర్మాణాలను త్వరగా పూర్తిచేయాలి:**

జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో కొనసాగుతున్న అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్స్ (ఏటీసీ) నిర్మాణ పనులను శరవేగంగా పూర్తిచేయాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సంబంధిత అధికారులను ఆదేశించారు. బోధన్ పట్టణ శివారులో చేపట్టిన ఏటీసీ భవన సముదాయ నిర్మాణం పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఇక్కడి ఏటీసీ భవనం నిర్మాణం పనులు బేస్‌మెంట్ వరకు మాత్రమే పూర్తికావడంపై అధికారులను ప్రశ్నించారు. పనులను త్వరగా పూర్తిచేయాలన్నారు. సొంత భవనాలు అందుబాటులోకి వచ్చేవరకు ఏటీసీ తరగతులను ఐటీఐ భవనాల్లో నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు.సబ్ కలెక్టర్ వికాస్ మహతో, తహసీల్దార్ విఠల్ ఉన్నారు.

**ఇంటింటి సర్వే పకడ్బందీగా నిర్వహించాలి**

కామారెడ్డి, నవంబర్ 1 : ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని కామారెడ్డి కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ సూచించారు. శుక్రవారం పట్టణంలోని వాసవీ హైస్కూల్ సమీపంలోని వార్డులో కొనసాగుతున్న ఇంటింటి సర్వేను పరిశీలించారు.సర్వేలో ప్రతి ఒక్కరి సమాచారాన్ని సేకరించాలని తెలిపారు. ఇంటిలోని సమాచారాన్ని సేకరించిన అనంతరం ఇంటి తలుపుపై స్టిక్కర్ అంటించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో రంగనాథ్ రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందూ ప్రియ, కౌన్సిలర్ నరేందర్, అధికారులు పాల్గొన్నారు.